క్లుప్తంగా

రీ సర్వే పరిశీలన



రీసర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగార్జున

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను తహసీల్దార్ నాగార్జున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుసేవా కేంద్రంలో రీసర్వేకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందజేశారు. రీసర్వే పనులు ఖచితత్వంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఎస్.చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ తాతరాజు మృతి



తాతరాజు(ఫైల్)

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 33వ వార్డు మాజీ కౌన్సిలర్ మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడిగా పని చేసిన గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు (తాతరాజు) అనారోగ్యం కారణంగా హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా వార్డు అభివృద్ధికి అలాగే మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడిగా సేవలందించారు. ఆయన మృతిపై పలువురు ప్రజా ప్రతినిధులు పలు పార్టీ నాయకులు, అభిమానులు ఆయనకు ఘన నివాళులర్పించి సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు, పెదగరువు గ్రామాలలో విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర గంటల వరకు తాడేరు, యమునాపల్లి, కొమ్రపాడు, బేతపూడి, కరుకువాడ, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. అలాగే కొవ్వాడ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో కొవ్వాడ, కొవ్వాడ పుంత, అన్నవరం గ్రామాలకు 25వ తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామస్తుల సహకారం అభినందనీయం



విద్యార్థుల తల్లులను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కాళ్ల: గ్రామస్తుల సహకారంతో ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ ఎ.రవీంద్ర అన్నారు. గురువారం సీసలి మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల (స్పెషల్) వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రభుత్వ బడిలో ఉండే చిన్నారుల సామర్థ్యాలను కొనియాడారు. విద్య ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులను సత్కరించారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి వారికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అడ్డాల వెంకటసుబ్బరాజు, ఉపాధ్యాయులు బి.రాజమౌళి కోటేశ్వరస్వామి, ఎస్.విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆక్వా క్రాప్ హాలిడేకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్‌రాజు

పాలకొల్లు(సెంట్రల్): ఆక్వా రైతులు సమస్యలు పరిష్కారం కావాలంటే ఆక్వా క్రాప్ హాలిడేకు సహకరించాలని పాలకొల్లు, నర్సాపురం, ఆచంట నియోజకవర్గాల ఆక్వా సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. గురువారం మండలంలోని జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం ఆధ్వర్యంలో ఆగర్రు, అగర్తిపాలెం, చందపర్రు గ్రామాల రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులు పడే కష్టాలు ప్రాసెసింగ్ కేంద్రాలకు, ఫీడ్ ఫ్యాక్టరీలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా క్రాప్ హాలిడే చేసి తీరాలన్నారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు క్రాప్ హాలిడేగా ప్రకటించడం జరిగిందన్నారు. దీనికి రైతులు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జై భారత్ ఆక్వా సంఘం సభ్యులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు

- భవిష్యత్ తరాలకు శాపం
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కాళ్ల: ప్లాస్టిక్ వ్యర్థాలు



ఆకివీడు: అయిభీమవరం రోడ్డు వెంబడి పారేసిన పాలిథీన్ వ్యర్థాలు



ఆకివీడు: మార్కెట్‌లో లభిస్తున్న పాలిథీన్ కవర్లు

కాళ్ల: ప్లాస్టిక్ వాడకం వలన ఎంత నష్టం వాటిల్లుతుందో ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయో ఎప్పటికప్పుడు పర్యావరణ నిపుణులు, వైద్యులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వాలు గాని, ప్రజలు గాని, అధికారులు గాని పట్టించుకోకుండా పెడచెవిన పెడుతున్నారు. రానున్న రోజుల్లో ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వలన క్యాన్సర్లు సోకే ప్రమాదం ఉందని ఓ పక్క వైద్యులు చెబుతున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వాలు మాత్రం తాత్కాలికంగా ప్లాస్టిక్‌ని ఆపాలనే ప్రయత్నాలు చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో అది నెరవేరటం లేదు. నేటి ఆధునిక యుగంలో ప్రజలు వాడే ప్లాస్టిక్ భవిష్యత్ తరాలకు శాపంగా మారుతోంది. ఈ–వేస్ట్ కూడా పర్యావరణానికి పెనుప్రమాదం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణానికి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క రిపై ఉందని పలువురు చెబుతున్నారు.

మొక్కుబడిగా స్వచ్ఛత–శుభ్రత

ప్రభుత్వం దో మొక్కుబడిగా స్వచ్ఛత–శుభ్రత అంటూ అప్పుడప్పుడు ఒక వారం హడావుడి చేయడం తప్పా శాశ్వత పరిష్కారాలు చూపలేకపోతున్నారని పర్యావరణ వేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యావరణాన్ని రక్షిస్తున్నట్లు రోడ్లు ఊడ్చడం చెత్త ఎత్తడం వంటి ఫొటోలు దిగి ప్రచారం చేసుకోవడానికే చాలా వరకు పరిమితం అవుతున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

పెద్ద దుకాణాల్లోనే విక్రయాలు

ప్లాస్టిక్ నిషేధించామని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. ప్లాస్టిక్ కవర్ల విక్రయాల నివారణకు చర్యలు తీసుకోకపోవడం, గ్రామాల్లో, పట్టణాల్లో అధికారులు ఏదో కంటి తుడుపు చర్యగా దుకాణాల్లో ఏడాదికోసారి తనిఖీలు నిర్వహించడం సర్వసాధారణమైంది. ప్లాస్టిక్ కవర్లను దహనం చేయడం, జరిమానాలు విధించడం వంటివి చేస్తున్నారు. తనిఖీలు చేస్తారనే ఆలోచనతో వ్యాపారులు ఆ రెండు రోజులు మినహాయించి మిగతా రోజుల్లో యథావిధిగా ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నారు. అధికారులు మాత్రం పొట్టకూటి కోసం తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారికి జరిమానాలు విధిస్తున్నారు. కవర్లు విక్రయించే దుకాణాల జోలికి వెళ్లకపోవడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్లాస్టిక్ కవర్లను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రచార ఆర్భాటంగా ప్లాస్టిక్ నిషేధం

ఆకివీడు: పాలిథీన్‌పై యుద్ధం ప్రకటించాం. వాటి వినియోగాన్ని అంతమొందించాలి. పాలిథీన్‌తో పర్యావరణానికి ముప్పు అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసి, ఆచరణ అడ్రస్ లేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగంగా అమ్మకాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. పాలిథీన్ కవర్లు, గ్లాసులు, ఇతర పాలిథీన్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. మార్కెట్లలో పాలిథీన్ కవర్లు లేనిదే కూరగాయలు, మాంసం, చేపలు వంటివి అమ్ముడవ్వని పరిస్థితి నెలకొంది. పండ్ల షాపుల్లోనూ, కాఫీ హోటళ్లలో పాలిథీన్ యథేచ్ఛగా వినియోగిస్తున్నా స్థానిక నగర పంచాయతీ అధికారులకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మురుగు బోదెలు, పక్కా డ్రెయిన్లు, రోడ్ల వెంబడి పాలిథీన్ వ్యర్థాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకునే నాథుడు లేడని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రచార ఆర్భాటానికే ప్రభుత్వం పాలిథీన్ వినియోగంపై నిషేధం విధించిందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాలిథీన్ కవర్లు, ఇతర వస్తువులను తయారు చేస్తున్న కంపెనీలను ఎందుకు మూయించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. 50 మైక్రాన్లకు మించి తయారైన వాటిని మాత్రమే వాడాలని సూచిస్తున్నా నిబంధనలను అమలు చేసేవారే లేరు. 40 మైక్రాన్లకు తక్కువ ఉన్న పాలిథీన్ సంచులను నిషేధించారు. రీ సైక్లింగ్‌కు ఉపయోగపడని రీతిలో అతి సూక్ష్మ పద్ధతిలో 8–10 మైక్రాన్ల కన్నా తక్కువ కల్గిన పాలిథిన్ సంచులు చలామణి అవుతున్నాయి. ఇవి పర్యావరణానికి మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. పాలిథిన్ తయారీ కంపెనీలకు పోటీగా మార్కెట్‌లో చైనా కవర్లు విజృంభిస్తున్నాయి. నిబంధలకు విరుద్ధంగా ఉన్న, చైనా కవర్లను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ఆలోచనలను డైవెర్ట్ చేసేందుకే

స్థానిక సమస్యలపైనా, ప్రభుత్వంపై వచ్చే వ్యతిరేక భావాల నుంచి ప్రజలను దారి మళ్లించేందుకే పాలిథీన్ వ్యర్థాలు పాలకులకు, అధికారులకు గుర్తుకొస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకటి రెండు రోజులు హడావుడి చేసి వదిలేయడం దారుణమంటున్నారు. అధికారుల కళ్ల ఎదుటే పాలిథీన్ అమ్మకాలు చేపడుతుంటే ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆదేశాలు లేవని ధ్వజమెత్తుతున్నారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు



ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్‌తో పాటు జీర్ణకోశ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రెస్టారెంట్లలో వేడిగా ఉన్న పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో పార్సిల్ చేసి విక్రయిస్తున్నారు. దీని వలన వేడికి కవర్లు కరిగి వాటిలోని రసాయనాలు ఆహార పదార్థాలలో కలుస్తున్నాయి. దీని వలన శ్వాస, చర్మ సంబంధమైన వ్యాధులు సంక్రమిస్తాయి. మహిళల్లో గర్భస్రావం, రుతు సమస్యలు వస్తాయి.

–డాక్టర్ సరాబు సునీల్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, కాళ్ల

కుసంపూడికి ఘన సత్కారం



నాగలక్ష్మిని సత్కరిస్తున్న ఎస్ఎంసీ సభ్యులు

పెనుమంట్ర: బ్రాహ్మణ చెరువు సూర్యారావుపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలుగా పని చేసి స్వచ్ఛంద పదవి విరమణ చేసిన కుసంపూడి నాగలక్ష్మిని గురువారం ఆ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఘనంగా సత్కరించింది. పాఠశాలలో 23 సంవత్సరాలు పాటు పిల్లలకు నాణ్యమైన భోజనం వండి పెడుతూ తల్లిదండ్రుల మన్ననలూ అందుకున్న నాగలక్ష్మి వృద్ధాప్య కారణంగా పదవి విరమణ చేశారు. ఆమెకు చాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అనురాధ, కేవీస్ ప్రసాద్, కె.సుబ్బరాజు, గండి బాలాత్రిపుర సుందరి, సాగిరాజు లక్ష్మి దుర్గ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రతిభావంతులకు అభినందనలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ పరిధిలోని ఆరు హైస్కూళ్లలో పదో తరగతి పరీక్షల ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అభినందించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థులు కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్య తరగతి పేద విద్యార్థులు ఎక్కువగా ఉన్నప్పటికీ 583 మార్కులు సాధించడం గొప్ప విశేషమన్నారు. అనంతరం పాఠశాలలోని ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన 12 మంది విద్యార్థులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆయా హైస్కూల్ హెచ్ఎంలు కె.వెంకటరావు, పీబీ శ్రీనివాస్, సత్యనారాయణ, వారణాసి రాధాకృష్ణ, విశ్వనాథరాజు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

స్కూల్ ఫస్ట్ ర్యాంకర్‌కు ప్రోత్సాహక బహుమతి

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 36 మంది విద్యార్థులు హాజరై 26 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత 72 శాతం నమోదైంది. ప్రతి సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థికి రాజమండ్రిలో స్థిరపడిన గొల్లలకోడేరు గ్రామానికి చెందిన భాస్కరం రూ.5000 ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు గతంలో ప్రకటించారు. ఈ మేరకు నిన్న వెలువడిన పదో తరగతి పరీక్షల్లో గొల్లలకోడేరు ఉన్నత పాఠశాల నుంచి 546 మార్కులు సాధించి, స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి కడలి సాత్విక్ వేణుకు గురువారం హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు సత్యనారాయణరాజు సమక్షంలో రూ.5000 ప్రోత్సాహక బహుమతిని అందించి, విద్యార్థిని అభినందించారు. ప్రతి సంవత్సరం తన సొంత సొమ్మును విద్యార్థులకు అందజేసి ప్రోత్సహిస్తున్న భాస్కరాన్ని గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థి సాత్విక్ వేణును అభినందిస్తున్న భాస్కరం, హెచ్ఎం

మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

ఆకివీడు: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ అధ్యక్షుడిగా మరపట్ల సుందర్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా డీవీ మోహనరావు, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కె.ఉష, కోశాధికారిగా ఎస్.హేమారాణి, జిల్లా కౌన్సిలర్లుగా బి.బులివెంకయ్య, కె.ఏలియాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సుందర్‌సింగ్ తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

పాలకొల్లు (సెంట్రల్): పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సీహెచ్ శ్రీనివాసు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లిషుపై పట్టు సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

భీమవరం: ఉన్నత విద్యనభ్యసించడానికి ఇంగ్లిష్ అవసరమని అందువలన ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని భీమవరం డీఎన్నార్ కళాశాల జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు అన్నారు. గురువారం వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎన్నార్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ మే 3వ తేదీ వరకు ప్రతి రోజూ శిక్షణ తరగతులు ఉంటాయని వీటిని భీమవరం పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు వెంకటపతిరాజు, కేవీఎస్ఎన్ రాజు, జాన్సీలక్ష్మి, కలిగొట్ల గోపాలశర్మ, సత్యమూర్తి, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రాజు, పి.సీతారామరాజు, ఎం.వెంకట్రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు



రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార భద్రతాధికారి ఏఎస్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): జువ్వలపాలెం రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రత అధికారి ఏఎస్ రెడ్డి గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల రా మెటీరియల్ క్షుణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో చికెన్ నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారని గమనించి, దానిని పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. రెస్టారెంట్లలో వినియోగించే నూనెను పలు సార్లు మరిగించి వినియోగించిన అనంతరం అది నిరుపయోగమవుతుందని టీపీసీ మీటర్ ద్వారా నిర్ధారించి హోటల్ యజమానులను హెచ్చరించారు. ఈ నూనెను ఒక క్యాన్‌లో నిల్వ ఉంచి నూనెను ఏజెన్సీకి అప్పజెప్పాల్సిందిగా సూచించారు. ఆహార భద్రత నియమాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినచో వారి లైసెన్స్‌ను రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారి ఏఎస్‌రెడ్డి హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం



భూ వరాహ లక్ష్మీనరసింహ హోమం నిర్వహిస్తున్న పండితులు

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సంప్రదాయబద్ధంగా సుదర్శన సహిత భూ వరాహ లక్ష్మీనరసింహ హోమం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో గాదిరాజు శ్రీహరిరాజు, లావణ్య దంపతులచే అర్చకులు శ్రీనివాసాచార్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో కుక్కల బాల, సరిపడకల రామారావు, జానపాటి మధు, పెన్మడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణికుమార్, అల్లం రమేష్, నళిని మోహన్, ఏడిద త్రిమూర్తులు, పద్మావతి మహిళా పారాయణం బృందం పాల్గొన్నారు.

ఉగ్ర మూకల దాడి అమానుషం



ఉండి: ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు



భీమవరం: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఉండి: కాశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అమానుషమని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నల్లా కిరణ్‌ప్రసాద్ అన్నారు. గురువారం ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిరణ్‌ప్రసాద్, గుండాబత్తుల సుబ్బారావు మాట్లాడుతూ దేశమంతా ప్రశాంతంగా ఉండటం ఉగ్రవాదులకు ఇష్టం లేకనే ఈ దాడికి పాల్పడ్డారన్నారు. కాశ్మీర్ వారి సొత్తు కాదని అది భారతదేశంలో భాగమన్నారు. దాన్నెవరూ ఏం చేసినా భారత్ నుంచి వేరు చేయలేరన్నారు. కార్యక్రమంలో దాసరి వరదయ్య, నానిమేడం, అళగిరి సత్యానందం, కాగిత మాతయ్య, మానే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

భీమవరం: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భీమవరం డీఎన్నార్ కళాశాలలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్ మాట్లాడుతూ శాంతియుతమైన భారత దేశంలో ముష్కరులు కుట్ర పూరితంగా దాడి చేసి, అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య మాట్లాడుతూ శాంతికి మారుపేరుగా ఉన్న భారతదేశాన్ని చీలిక వాదంతో ముష్కరులు దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో కె.గౌతమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.ఉషారాణి, సీహెచ్‌జీ సోమరాజు, ఎం.సత్యవాణి, పి.ప్రసన్నకుమారి, బి.పద్మజ, ఎంవీఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ కె.సోమయ్య, ఎస్.అనిల్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడి పిరికిపంద చర్య



కవురు శ్రీనివాస్

వీరవాసరం: పహల్గాం వద్ద కాశ్మీర్ పర్యాటకులపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ గురువారం ఖండించారు. దాడికి పాల్పడిన వారు జంతువుల్లా ప్రవర్తించి, అమానుషంగా వ్యవహరించారన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేయాలి



ఉపాధ్యాయిని సుధారాణి దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంఈవో

ఉండి: ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి విద్యార్థులను ఉన్నత చదువుల వైపు మళ్లించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కలిసిపూడిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న ముదిండి సుధారాణి పదవీ విరమణ అభినందన సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, సర్పంచ్ కేశబోయిన జానకీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రపంచానికి దిక్సూచీలన్నారు. ఎంఈవోలు జ్యోతి, వినాయకుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రిటైర్డ్ అయితే వారి ప్రతి రూపాలుగా విద్యార్థులు ఉంటారన్నారు. ఎంతో గౌరవమైన వృత్తి నిర్వహించి పదవీ విరమణ చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఇటీవల డాక్టరేట్ అందుకున్న గాదిరాజు రంగరాజును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దంగేటి రామలింగేశ్వరరావు, గుండాబత్తుల సుబ్బారావు, ఆనంద్, పార్వతీ, కృష్ణంరాజు, సత్యనారాయణ, సుబ్బరాజు, ఆంజనేయులు, మధు, వామనమూర్తి, సురేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి కాళ్లకూరు వెంకన్న కల్యాణ మహోత్సవాలు

కాళ్ల: కాళ్లకూరులలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక సప్తాహ్నిక తిరు కల్యాణ మహోత్సవాలు మే 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవాలు గోడ పత్రికలను ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఆవిష్కరించారు. ఇప్పటికే ఆలయం వద్ద చలువ పందిళ్ల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడ్డాల శివరామరాజు, దాట్ల వెంకట రామరాజు, అనిపెద్ది ఫణిశర్మ, తదితరులు పాల్గొన్నారు.